క్లుప్తంగా

23న పాతశివాలయంలో కానుకల లెక్కింపు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని పురాతన ఆలయమైన శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం (పాతశివాలయం)లో ఈ నెల 23న భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకల లెక్కింపు నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి నటరాజన్ షణ్ముగం తెలిపారు. బుధవారం ఉదయం పది గంటల నుంచి లెక్కింపు జరుగుతుందని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న భక్తులు ముందుగా ఆలయ కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. లెక్కింపులో పాల్గొనాలనుకునే భక్తులు సంప్రదాయ వస్త్రధారణలో రావాలని సూచించారు.

సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లండి

వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): కృష్ణా నదికి ఎగువ నుంచి వరద వచ్చే అవకాశం ఉందని, నగరంలోని నదీ పరీవాహక ప్రాంత ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని శనివారం వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర శనివారం ఓ ప్రకటనలో సూచించారు. వాతావరణ శాఖ హెచ్చరికలతో నగరంలో విస్తారంగా వర్షాలు కురవనున్నాయని, ఈఈ రివర్ కన్జర్వేటర్ కృష్ణ సెంట్రల్ డివిజన్ సమాచారం మేరకు ప్రకాశం బ్యారేజీలో ప్రస్తుతం నీటిమట్టం 57,500 క్యూ సెక్కులు ఉండగా, పులిచింతల ప్రాజెక్ట్ నీటిమట్టం లక్ష క్యూసెక్కులకు పెరిగిందని, ప్రకాశం బ్యారేజీ నీటిమట్టం కూడా ఆదివారం లక్ష క్యూసెక్కులకు పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. కృష్ణానది పరివాహక ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వరద హెచ్చరికలతో వీఎంసీలో 24/7 పని చేసేలా కంట్రోల్ రూంను ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని, వీఎంసీ ఏర్పాటు చేసిన ప్రత్యేక కంట్రోల్ రూంకు నిరంతరం ప్రజలు ఫిర్యాదులను అందజేయవచ్చని సూచించారు.

హాక్తాన్ ఈవెంట్స్‌తో సాంకేతిక ప్రావీణ్యత పరిశీలన



మైలవరం: విద్యార్థులు కొన్ని గంటల్లో వారి సాంకేతిక ప్రావీణ్యతను పరిశీలించుకునేందుకు హాక్తాన్ ఈవెంట్స్ ఎంతగానో ఉపయోగపడుతుందని వెండర్ మేనేజర్ పి.విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో మెర్న్ ఫుల్ స్టాక్ టెక్నాలజీస్ అనే సాంకేతిక అంశంపై 24 గంటలు హాక్తాన్ శనివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మెర్న్‌ఫుల్ టెక్నాలజీస్ అనేది ప్రముఖ సాంకేతిక అంశాల్లో ఉన్నత స్థానంలో ఉందన్నారు. ప్రముఖంగా నోడ్ జేఎస్, రియాక్ జేఎస్, ఎక్స్‌ప్రెస్ జేఎస్, మోన్గో డీబీ అంశాలు వెబ్ అప్లికేషన్ సమర్థవంతంగా డెవలప్ చేయడంలో ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయన్నారు. వీటి ద్వారా ఎన్నో డైనమిక్ అప్లికేషన్స్ తయారు చేయవచ్చని చెప్పారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్‌రెడ్డి మాట్లాడుతూ సాంకేతిక ప్రావీణ్యత ఆధారంగా మాత్రమే ఈ రోజుల్లో ఐటీ కంపెనీలు విద్యార్థులకు ఇంటర్న్‌షిప్, ఉద్యోగాలు ఇస్తున్నాయన్నారు. కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ వి. వీరయ్య, డాటా సైన్స్ విభాగాధిపతి డాక్టర్ ఓ.రమాదేవి, ఈవెంట్ కో–ఆర్డినేటర్ డాక్టర్ వై. విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దాసాంజనేయుడికి సింధూర పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్వయంభూ మాచవరం శ్రీదాసాంజనేయస్వామి దేవాలయంలో శనివారం ప్రత్యేక అర్చనలు జరిగాయి. అర్చకులు స్వామివారికి ప్రీతికరమైన సింధూరం, ఆకుపూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. వాహన చోదకులు వాహన పూజలు చేయించుకున్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి పర్యవేక్షించారు.

మహిళలు క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవాలి



మధురానగర్(విజయవాడసెంట్రల్): ఏడాదిలో రెండు సార్లు 40 సంవత్సరాలు దాటిన మహిళలు క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవాలని డాక్టర్ కేపీ రంగనాథ్ సూచించారు. మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ రొమ్ము క్యాన్సర్ అవగాహన మాసోత్సవాల్లో భాగంగా శనివారం అవగాహన కార్యక్రమం జరిగింది. ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని క్యాన్సర్ లక్షణాలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా క్యాన్సర్ లక్షణాలు ఉంటే ఇంటివద్దనే ఎలా గుర్తించాలో తెలియజేశారు. రొమ్ము క్యాన్సర్ మహిళల్లో మాత్రమే వస్తుందని చాలామంది భావిస్తారని కానీ పురుషుల్లో కూడా వస్తుందని తెలిపారు.



మున్సిపల్ అధికారులు కొంత మేర నిర్మించి వదిలేసిన పక్కా డ్రెయిన్

శాశ్వత పరిష్కారం ఏదీ!

- కచ్చా డ్రెయిన్‌లో కొంతమేరే నిర్మాణం
- ఎక్కడి వ్యర్థాలు అక్కడే
- పట్టించుకోని పంచాయతీ, మున్సిపల్ అధికారులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): రామరాజ్యనగర్ డొంక రోడ్డు ముంపు బారిన పడకుండా ఉండటానికి శాశ్వత పరిష్కారం చూపడం లేదని స్థానికంగా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇక్కడ ఆక్రమణలు పెరిగిపోతున్నాయి. గతంలో ఇక్కడ ఉన్న కచ్చా అవుట్‌ఫాల్ డ్రెయిన్ ఆనుకుని సుమారు 60–70 మంది పేదలు చిన్నపాటి ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్నారు. కొంత మంది పెద్దలు ఆక్రమించుకుని షెడ్‌లు నిర్మించి అద్దెలకు ఇచ్చి వేరే ఎక్కడో ఉంటూ అప్పుడప్పుడు వచ్చి పోతుంటారు. భారీ వర్షాలు కురిసినప్పుడు ఈ ప్రాంతం ముంపునకు గురి కావడం పరిపాటిగా మారింది. వారికి ప్రత్యామ్నాయంగా వేరే చోట ఇళ్లు కేటాయించాలని అప్పటి మున్సిపల్ కమిషనర్ రవిబాబు భావించారు. తదనుగుణంగా ఎన్యుమరేషన్ కూడా చేయించారు. విషయం తెలిసిన కొందరు స్థానిక పెద్ద మనుషులతోపాటు మరి కొందరు 20, 30, 40 గజాల చొప్పున విక్రయించి సొమ్ము చేసుకోవడంతో అక్కడ ఆక్రమణలు రెట్టింపయ్యాయి.

రామరాజ్యనగర్ డొంక రోడ్డులో పెరుగుతున్న ఆక్రమణలు

ఇవేమీ పట్టించుకోని విద్యుత్ శాఖ అధికారులు ఎడాపెడా కనెక్షన్‌లు ఇవ్వడం, ఎక్కడ పడితే అక్కడ విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేసి వెళ్లిపోవడం, భారీ వర్షాలు కురిసినప్పుడు మునిగిపోయిన ఆ ఇళ్లల్లోని మీటర్లు నీళ్లల్లో తేలియాడిన సంఘటనలు అనేకం ఉన్నాయి. గొల్లపూడి పంచాయతీ పరిధిలో ఉన్న ఈ డొంక రోడ్డు ప్రాంతానికి స్థానిక టీడీపీ నాయకుడు బొమ్మసాని సుబ్బారావు నగర్‌గా తన పేరు పెట్టుకుని (2014–19)లో స్థానికులకు మద్దతుగా నిలిచి ఎటువంటి డాక్యుమెంట్స్ లేకపోయినా విద్యుత్, వాటర్ సరఫరా వంటి సౌకర్యాలు కల్పించి అందరినీ తనవైపు మళ్లించుకున్నారు.



ఊర్మిళానగర్ మలుపులోని బొమ్మసాని సుబ్బారావునగర్

ఇంతియాజ్ నగర్‌గా నామకరణం

రామరాజ్యనగర్ డొంక రోడ్‌లో ఆక్రమణలు పెరిగిపోవడం, తరచూ ముంపునకు గురవుతుండటంతో 2019లో కలెక్టర్‌గా ఉన్న ఇంతియాజ్ అహ్మద్.. డ్రెయిన్‌కు ఆనుకుని ఆక్రమించుకుని ఉంటున్న కొందరితోపాటు రామరాజ్యనగర్‌లోనే మరి కొందరు పేదలకు ఇళ్ల పట్టాలిచ్చారు. అందుకు కృతజ్ఞతగా డొంకరోడ్‌లోని లబ్ధిదారులందరూ కలిసి 'ఇంతియాజ్ నగర్'గా నామకరణం చేసుకుని బోర్డు ఏర్పాటు చేశారు. ఆ తరువాత 2024లో టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే బొమ్మసాని సుబ్బారావు మళ్లీ తెర మీదకు వచ్చి అప్పటి వరకు ఉన్న ఇంతియాజ్ నగర్ బోర్డ్‌ను తొలగించి బొమ్మసాని సుబ్బారావునగర్ బోర్డ్‌ను ఏర్పాటు చేసుకున్నారు. ఇటీవల సంభవించిన బుడమేరు వరద సమయంలో డొంక రోడ్ యధావిధిగానే ముంపునకు గురయిన స్థానికులు సర్వం కోల్పోయి వారం రోజులపాటు వరద నీటిలోనే నానా ఇబ్బందులు పడ్డారు. అయినా తమను ఎవరూ పట్టించుకోలేదని స్థానికులు వాపోయారు.

సమన్వయం లేక

ఊర్మిళానగర్ మెయిన్ రోడ్ చివర మలుపు (కబేళా వైపు వెళ్లే రోడ్)కు ఆనుకుని ఉన్న రామరాజ్యనగర్ డొంక రోడ్ రైల్వే లైన్ కరకట్టకు అనుసంధానంగా ఉంటుంది. ఈ ప్రాంతం గొల్లపూడి గ్రామ పంచాయతీ పరిధిలో ఉండటంతో అటు వారుగానీ ఇటు వీఎంసీ అధికారులుగానీ పట్టించుకోక పోవడంతో మౌలిక సదుపాయాలు లేక స్థానికులు నానా అవస్థలు పడుతున్నారు. ఎట్టకేలకు మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు డొంక రోడ్‌లోని కచ్చా అవుట్‌ఫాల్ డ్రెయిన్ స్థానంలో గత టీడీపీ పాలనలో పక్కా డ్రెయిన్ నిర్మాణానికి పూనుకున్నారు. వాస్తవానికి ఊర్మిళానగర్ మలుపులో ఉన్న బాక్స్ కల్వర్ట్ నుంచి చివరి (రామరాజ్యనగర్ రైల్ కరకట్ట) వరకు పక్కా అవుట్‌ఫాల్ డ్రెయిన్ నిర్మించాల్సి ఉండగా అధికారులు ఇష్టారాజ్యంగా కొంత మేర మాత్రమే నిర్మించి వదిలేశారు. దీంతో కథ మళ్లీ మొదటికొచ్చి వ్యర్థాలు ఎక్కడికక్కడే నిలిచిపోయి పారిశుద్ధ్య సమస్యలు తలెత్తుతున్నాయి. పాలకులుగానీ, అధికారులుగానీ డొంక రోడ్ ముంపునకు శాశ్వత పరిష్కారం చూపలేరా అని ప్రశ్నిస్తున్నారు.



కచ్చా అవుట్‌ఫాల్ డ్రెయిన్‌లో పేరుకుపోయిన చెత్తాచెదారం, వ్యర్థాలు

ప్రైవేట్ స్థలాల్లోనే బాణసంచా విక్రయాలు!

వీఎంసీ అధికారులపై కూటమి నేతల ఒత్తిడి..

పటమట(విజయవాడతూర్పు): ప్రైవేట్ స్థలాల్లోనే బాణసంచా విక్రయాలు చేయాలని వీఎంసీ అధికారులపై కూటమి నేతలు ఒత్తిడి తెస్తున్నట్లు తెలుస్తోంది. నగరంలోని మూడు సర్కిళ్ల పరిధిలో వీఎంసీకి పదుల సంఖ్యలో ఖాళీ స్థలాలున్నాయి. ఏటా వీటిలో బాణసంచా స్టాల్స్ ఏర్పాటుచేసేవారు. లాటరీ ద్వారా దుకాణాలు కేటాయించేవారు. ఇక్కడ ధర కూడా తక్కువగా ఉంటుంది. భద్రతా చర్యలు ఉండేవి. అదే కూటమి నేతలు చెప్పినట్లు ప్రైవేట్ స్థలాల్లో విక్రయాలు జరిపితే అద్దె అధికంగా ఉంటుంది. ప్రభుత్వ అజమాయిషీ లేక భద్రతా ప్రమాణాలు తక్కువగా ఉంటాయి. ఈ ఏడాది స్టాల్స్ ఏర్పాటు ఆలస్యమవుతుండటంపై వ్యాపారులు వీఎంసీపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. అయితే కూటమి నేతలు ప్రైవేట్ స్థలాల్లో ఏర్పాటుచేయాలని అల్టిమేటం ఇవ్వడంతో అధికారులు స్పందించడం లేదు. అయితే బాణసంచా విక్రయ స్టాల్స్ ఏర్పాటుచేయకపోతే వీఎంసీ ఆదాయం కోల్పోవాల్సి ఉంటుంది.

అలరించిన నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థానం ఇంద్రకీలాద్రిపై శ్రీసుగమ్య శంకర్ బృందం ప్రదర్శించిన నృత్య ప్రదర్శన భక్తులను అలరించింది. శనివారం సాయంత్రం అమ్మవారికి పంచహారతుల సేవ అనంతరం ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై కళాకారులు పలు కీర్తనలకు చక్కటి అభినయంతో నృత్య ప్రదర్శన చేశారు. అనంతరం శిష్య బృందానికి అమ్మవారి దర్శనం కల్పించిన ఆలయ అధికారులు ప్రసాదాలను అందించారు.

ఆహ్లాదకరంగా డ్రోన్ సమ్మిట్

పటమట(విజయవాడతూర్పు): నగరంలో జరిగే డ్రోన్ సమ్మిట్‌కు వచ్చే సందర్శకులకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. నగర పర్యటనలో భాగంగా ఆయన శనివారం పున్నమిఘాట్, బబ్బూరి గ్రౌండ్స్‌లో ప్రతిష్టాత్మకంగా నిర్వహించబోతున్న డ్రోన్ సమ్మిట్లో జరగబోయే డ్రోన్ షో ఏర్పాట్లను పరిశీలించారు. కృష్ణానది తీరంలో పారిశుద్ధ్య నిర్వహణ పక్కాగా జరగాలని, ప్రజారోగ్య విభాగాన్ని ఆదేశించారు. ఘాట్ల వద్ద రెయిలింగ్‌కు మరమ్మతులు చేయాలని ఇంజినీరింగ్ సిబ్బందిని ఆదేశించారు, మొక్కలు నాటి హరితాన్ని పెంచాలని హార్టికల్చర్ విభాగాన్ని ఆదేశించారు. ఈ పర్యటనలో చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీఎస్వీ ప్రసాద్, చీఫ్ ఇంజినీర్ శ్రీనాథ్‌రెడ్డి, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ ఇన్‌చార్జి డాక్టర్ సురేష్ బాబు, సూపరింటెండెంట్ ఇంజినీర్ (వర్క్స్) పి.సత్యనారాయణ, జాయింట్ డైరెక్టర్ (అమృత్), ఇన్‌చార్జి పీవో యూసీడీ డాక్టర్ లత, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఏఎస్ఎన్ ప్రసాద్, ఇంజినీరింగ్ శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



బబ్బూరి గ్రౌండ్స్‌ను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

ప్రజలకు ఉపయోగపడే ఆవిష్కరణలు చేయాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ప్రజలకు ఉపయోగపడే ఆవిష్కరణలను తీసుకురావడానికి విద్యార్థులు కృషి చేయాలని పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ అధ్యక్షుడు చలవాది మల్లికార్జునరావు అన్నారు. ఆ కళాశాల ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో ఎస్ఆర్‌సీఈ సొల్యూషన్ సౌజన్యంతో నిర్వహించిన వర్క్‌షాప్ శనివారం ముగిసింది. ఈ సందర్భంగా మల్లికార్జునరావు మాట్లాడుతూ విద్యార్థులు తమ రంగాల్లో సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకొని సమాజానికి మేలు చేసే నూతన ఆవిష్కరణలను తీసుకురావాలన్నారు. రిసోర్స్ పర్సన్ సత్యకుమార్ మాట్లాడుతూ వర్క్‌షాప్‌లో రైతులకు ఉపయోగపడే పలు నమూనాలను రూపొందించారన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి చిట్టి అమర్‌సుధీర్, ఉపాధ్యక్షుడు పొట్టి సురేంద్రకుమార్, కోశాధికారి కె. రాఘవయ్య, ప్రిన్సిపాల్ డాక్టర్ పతంజలిశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

ఏఐతో విస్తృత అవకాశాలు

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో విస్తృత ఉపాధి అవకాశాలు లభిస్తాయని నిట్ ఏపీ ఈఈఈ విభాగ ఆచార్యుడు డాక్టర్ శంకర్ పెద్దపాటి అన్నారు. ఆ కళాశాల ఈఈఈ విభాగం ఆధ్వర్యంలో ఏఐ సొల్యూషన్స్ ఫర్ పవర్ ఎలక్ట్రానిక్స్ అప్లికేషన్స్‌పై సదస్సును శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్, ప్రభుత్వ రంగాల్లో అనేక అవకాశాలు ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విభాగాధిపతి డాక్టర్ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఏఐపై విద్యార్థులు దృష్టి సారించాలి

పెనమలూరు: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)పై ఇంజినీరింగ్ విద్యార్థులు దృష్టి సారించాలని టీఏ ఎస్ గ్రూప్ హెడ్ ఆపరేషన్స్ పి. సురేంద్రబాబు అన్నారు. గంగూరు ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీలో గత ఐదు రోజులుగా జరిగిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై శనివారం శిక్షణ తరగతుల ముగింపులో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఏఐ, మిషన్ లెర్నింగ్, రోబోటిక్స్, పైథాన్ వంటి అడ్వాన్స్ అంశాలపై విద్యార్థులు నైపుణ్యం సాధించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆటమ్ పేరుతో రూపొందించిన ఫిమేల్ రోబో పని తీరును విద్యార్థులు వివరించారు. కార్యక్రమంలో కాలేజీ డైరెక్టర్ రవి ప్రసాద్, ప్రిన్సిపాల్ కడియాల రవి, ప్రొఫెసర్లు డాక్టర్ రావి సత్యప్రసాద్, డాక్టర్ ఎం.వంశీకృష్ణ, డాక్టర్ గోగినేని రాజేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



గంగూరులో ఏఐపై ముగిసిన శిక్షణలో ఫిమేల్ రోబోతో విద్యార్థులు

బ్యాంకింగ్, జీవన నైపుణ్యాలపై అవగాహన

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం సైన్స్ విద్యార్థులకు మెడికల్ కోడింగ్, వివిధ ప్రోగ్రాంలు, కామర్స్ విద్యార్థులకు బ్యాంకింగ్, జీవన నైపుణ్యాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఇటలీకి చెందిన కేర్ టు ఆక్షన్ చైర్మన్ తొమాసో కరోరా, జోవన్నా ముఖ్య అతిథులుగా పాల్గొని విద్యార్థులతో మమేకమై మెడికల్ కోడింగ్, బ్యాంకింగ్, జీవన నైపుణ్యాలపై వివరించారు. కాలానుగుణంగా విద్యార్థులు నైపుణ్యాలు పెంపొందించుకుంటే లక్ష్య సాధన చేయొచ్చన్నారు. అనంతరం కళాశాల ఆవరణలో మామిడి మొక్కను నాటారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె. భాగ్యలక్ష్మి, మాట్లాడుతూ కేర్ టు ఆక్షన్ చొరవతో విద్యార్థులకు అనేక ఉపయోగాలు ఉన్నాయని తెలిపారు. అనంతరం తోమాసా కరోరా, జోవన్నాలను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె భాగ్యలక్ష్మి, కళాశాల సిబ్బంది ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రోజలిండ్, డి. బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.

ఉద్యోగాల పేరుతో మోసం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లా కోర్టులో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ మహిళల నుంచి డబ్బులు వసూలు చేసి మోసం చేసిన వ్యక్తులపై భవానీపురం పోలీసుస్టేషన్‌లో శనివారం కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు.. గొల్లపూడికి చెందిన అహ్మద్, టి.వెంకటరమణ, కిషోర్ కలిసి జిల్లా కోర్టులో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ 2022 సెప్టెంబర్‌లో వివిధ ప్రాంతాలకు చెందిన 11 మంది వద్ద పలు దఫాలుగా రూ.1.10 కోట్లు వసూలు చేశారు. కోర్టులో సీనియర్ అసిస్టెంట్ ఉద్యోగాలు ఇప్పిస్తామని నకిలీ పత్రాలు ఇచ్చారు. డబ్బులు తీసుకున్నాక ఆ ముగ్గురు వ్యక్తులు ఉద్యోగాలపై సరైన సమాధానం చెప్పకపోవడంతో బాధితురాలు లింగా నిర్మలాదేవి భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బాధితులు రామలక్ష్మి, నిర్మలాదేవి, వెంకటరమణ భవానీపురం 40వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు చిన్న సుబ్బయ్య కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ తమను మోసం చేశారని, న్యాయం చేయాలని కోరారు.

శాశ్వత ఇళ్ల పట్టాలివ్వండి

- మాజీ మంత్రి వెలంపల్లి
- పాత ఆర్‌ఆర్‌పేటలో నిరసన

పూర్ణానందంపేట(విజయవాడ పశ్చిమ): పాత రాజరాజేశ్వరిపేటలోని నివాసితులకు శాశ్వత ఇళ్లపట్టాలను అందించాలని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ పశ్చిమ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. రైల్వే శాఖ అధికారులు పాత ఆర్‌ఆర్‌పేటలోని రైల్వే స్థలంలో నివాసాలు ఏర్పాటు చేసుకున్న వారు 15 రోజుల్లో ఖాళీ చేయాలని లేని పక్షంలో కూల్చి వేస్తామంటూ శుక్రవారం దండోర వేయించారు. దీన్ని నిరసిస్తూ స్థానికులు శనివారం ధర్నా చేశారు. మాజీ మంత్రి వెలంపల్లి మాట్లాడుతూ గతంలో కూడా ఎన్డీఏ ప్రభుత్వం ఉన్నప్పుడు ఇక్కడి నివాసితులకు ఇబ్బందులు కల్పించిందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైల్వే అధికారులతో మాట్లాడి వారికి ప్రత్యామ్నాయంగా వేరేచోట స్థలం కేటాయిస్తామని చెప్పారన్నారు. తమ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఇళ్ల పట్టాలు ఇస్తామంటే కేంద్రం సహకరించలేదన్నారు. ఎంపీ కేశినేని చిన్ని, పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి వారికి ఇళ్ల పట్టాలు వచ్చేలా కృషిచేయాలన్నారు. లేనిపక్షంలో వైఎస్సార్ సీపీ స్థానిక ప్రజలకు మద్దతుగా ధర్నా చేస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో 56వ డివిజన్ కార్పొరేటర్ యలకల చలపతిరావు, 55వ డివిజన్ కార్పొరేటర్ శిరంశెట్టి పూర్ణచంద్రరావు, స్థానికులు బత్తుల పాండు, గొలగాని శ్రీను, లత, వాసా బాబు తదితరులు పాల్గొన్నారు.



పాత ఆర్‌ఆర్‌పేటలో నిరసన తెలుపుతున్న వెలంపల్లి, ఇతర ప్రజాప్రతినిధులు

- పాత రాజరాజేశ్వరిపేట వాసులకు సీపీఎం అండగా ఉంటుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు తెలిపారు. పాత ఆర్‌ఆర్‌పేటలోని రైల్వే స్థలాల్లో నివసిస్తున్నవారు వెంటనే ఖాళీ చేయాలని రైల్వే శాఖ అధికారులు శుక్రవారం దండోరా వేయించటంతో ఆందోళన చెందుతున్న స్థానికులను శనివారం బాబురావు పరామర్శించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బోయీ సత్యబాబు, ఇతర నేతలు పాల్గొన్నారు.

వీధి విక్రయదారులకు ఆర్థిక సాయం చేయండి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): బుడమేరు ముంపు కారణంగా నష్టపోయిన వీధి విక్రయదారులకు ఆర్థిక సాయాన్ని అందించాలని సీపీఐ నగర కార్యదర్శి కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. వీధి విక్రయదారుల కార్మిక ఫెడరేషన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యాన వన్‌టౌన్ లెనిన్‌భవన్‌లో వరదల్లో నష్టపోయిన చిరు వ్యాపారం చేసుకునే మహిళలకు చీరలు పంపిణీ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో వరదలతో 32 డివిజన్లు జలదిగ్బంధంలో ఉన్న విషయం తెలిసిందేనన్నారు. బాధితులకు ఆర్థిక సహాయం చేసి ఆదుకోవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. బుడమేరు ముంపులో నష్టపోయిన చిరు వ్యాపారులను కూడా ఆదుకుంటామని ముఖ్యమంత్రి ఇప్పటికే ప్రకటించారన్నారు. సుమారు ఐదువేల మంది వీధి విక్రయదారులు వీఎంసీకి అర్జీలు పెట్టుకున్నారని, వారికి వెంటనే ఎన్యుమరేషన్ చేసి ఆర్థిక సాయం అందించవల్సిందిగా మున్సిపల్ కమిషనర్‌ని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నగర కార్యదర్శి మూలి సాంబశివరావు, వీధి విక్రయదారుల కార్మిక ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తెద్దు వెంకటేశ్వరరావు, హాకర్స్ యూనియన్ నగర అధ్యక్షుడు కొట్టు రమణారావు తదితరులు పాల్గొన్నారు.

నష్టపరిహారం చెల్లించాలని ఆందోళన

ఇబ్రహీంపట్నం: కృష్ణానదికి ఇటీవల వచ్చిన వరద ప్రభావంతో ఇళ్లు నీట మునిగి సర్వం కోల్పోయిన బాధితులకు నష్టపరిహారం చెల్లించాలని తహసీల్దార్ కార్యాలయం వద్ద శనివారం ఆందోళనకు దిగారు. నష్టపరిహారం అంచనా వేయడంలో రెవెన్యూ, సచివాలయ అధికారుల నిర్లక్ష్యంతో పరిహారం అందలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సీఐటీయూ మండల కార్యదర్శి ఎం.మహేష్ మాట్లాడుతూ అధికారుల నిర్లక్ష్యంతో మండలం పరిధి గ్రామాల్లో సుమారు 2 వేల మంది బాధితులకు పరిహారం అందలేదన్నారు. బాధితుల అర్జీలు ఆన్‌లైన్ చేయకుండా నిర్లక్ష్యం వహించిన రెవెన్యూ అధికారులపై తక్షణం చర్యలు తీసుకుని బాధితులందరికీ నష్టపరిహారం చెల్లించాలని కోరారు.





ప్రమాదాలతో ఆటలొద్దు

నగరంలోని భవానీఘాట్ వద్ద ఐరన్ బారికేడ్స్ పడిపోవడంతో ప్రమాదకరంగా కనిపిస్తున్నాయి. ఘాట్‌కు వస్తున్న సందర్శకులు, పిల్లలు ఆ ప్రాంతంలో ఆడుకుంటున్నారు. నదిలో నీటి ప్రవాహం పెరగడం, బారికేడ్లు లేకపోవడంతో అపాయకరంగా ఉంది. ఏ మాత్రం తప్పినా నీటిలో పడిపోవడమే. ఈ దృశ్యాలను శనివారం భవానీఘాట్ వద్ద 'సాక్షి' క్లిక్‌మనిపించింది. -సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ